
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

సూర్యాపేట
5
గురువారం 22 ఆగస్టు 2024

** గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.20 (309.6546)	37,882	47,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.07)	1,935.29	385.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.67 (45.25)	16,000	15,600

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.200

జిల్లాను వణికిస్తున్న విషజ్వరాలు

జిల్లాను విషజ్వరాలు వణికిస్తున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ విష జ్వరాలతో బాధ పడుతున్నారు. డెంగీ వ్యాధి బారిన పడి అనేక మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడు తున్నాయి. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు విఫలమయ్యారు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డెంగీ వ్యాధి నిర్ధారణకు వైద్యశాలల్లో కిట్లు అందుబాటులో ఉన్నా పరీక్షలు మాత్రం చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. డెంగీతో పాటు మలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్, రక్తకణాలు తగ్గడం లాంటి వ్యాధులు ఇటీవల ఎక్కువగా వస్తున్నాయి.

● సూర్యాపేట క్రైం


హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో విష జ్వరాలతో-చికిత్స పొందుతున్న రోగులు



- భారీగా నమోదువుతున్న డెంగీ కేసులు
- పీహెచ్‌సీల్లో మూలకు పడ్డ సెల్‌కౌంటర్లు
- రోగులతో కిటకిటలాడుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు
- సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి రోజూ 1,200 మందికి పైగా రోగులు

పల్లెలు, పట్టణాలు విషజ్వరాలతో వణుకుతున్నాయి. గ్రామాల్లో రెండు, మూడు రోజులకు గాని వైద్యసిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడటంతో పాటు చేసేది లేక పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రులలో డబ్బులు వెచ్చించి ప్రజలు వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు.

పంజా విసురుతున్న డెంగీ

జిల్లాలో డెంగీ వ్యాధి పంజా విసురుతోంది. ఇప్పటికే 400పైగా కేసులను గుర్తించారు. అనేకమంది హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కిట్లు ఉన్నప్పటికీ డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో డెంగీ నిర్ధారణ కోసం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి రోగులు తరలివస్తున్నారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, కోదాడ, హుజూర్‌నగర్ ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో జిల్లాలోని పీహెచ్‌సీలకు వచ్చిన రోగులను వైద్యులు సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి పంపిస్తున్నారు. దూర ప్రయాణంచేయలేని వారు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. వ్యాధి తీవ్రత పెరగడంతో హైదరాబాద్‌కు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రులల్లో లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకుంటున్నారు.

ప్రైవేట్‌లో దోపిడీ

హుజూర్‌నగర్: విషజ్వరాలు ప్రబలడంతో ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఆడిందే ఆట సాగుతోంది. యజమానులు, వైద్యులు అడిగినంత చెల్లించుకోవాల్సి వస్తోంది. హుజూర్‌నగర్ వంటి మునిసిపాలిటీలో విషజ్వరాలు పెరిగిపోతున్నాయి. స్థానికంగా ఏ ప్రైవేట్ ఆసుపత్రి చూసినా విషజ్వరాల రోగులతో కిక్కిరిసి పోతున్నాయి. ఆసుపత్రికి వెళితే రూ.50 వేల బిల్లు వదిలించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మెడికల్ మాఫియా జోరు కొనసాగుతోంది. డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులకు పరీక్షల పేరిట రూ.2 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. ఇక సీబీపీ, టైఫాయిడ్, మలేరియా, సీఆర్‌పీ పేరుతో రోగుల నుంచి రూ.3 నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొందరికి అవసరం లేకున్నా పరీక్షలు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలు పట్టణాల్లోని ల్యాబ్‌ల వారితో కుమ్మక్కై ప్లేట్‌లేట్స్ పడిపోయాయని, వేలరూపాయలు వసూలు చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలకు తోడు పారిశుధ్యం పాటించకపోవడంతో విషజ్వరాలు విస్తరిస్తున్నాయి. వీధులు మురికికూపాలను తలపిస్తున్నాయి. విషజ్వరాలు విస్తరించకుండా అవగాహన కల్పించాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నామమాత్రంగా పర్యటన చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పీహెచ్‌సీల్లో మూలకుపడ్డ సెల్ కౌంటర్లు

జిల్లాలోని పీహెచ్‌సీలో లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన సెల్‌కౌంటర్లు మూలకు పడ్డాయి. సుమారు మూడేళ్ల కిందట జిల్లాలోని 20 పీహెచ్‌సీలకు ఒక్కో దానికి రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు వెచ్చించి సెల్‌కౌంటర్లు ఏర్పాటుచేశారు. వీటి ద్వారా పీహెచ్‌సీల్లోనే సీబీపీ, ఎలక్ట్రోలైట్స్‌తో పాటు ఇతర పరీక్షలు కూడా చేసే అవకాశముంది. ఈసెల్ కౌంటర్లు కొన్నాళ్ల బాగానే పనిచేశాయి. తర్వాత వాటిని సర్వీసింగ్ చేయించాల్సి ఉండడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోలేదు. దీంతో అవి ప్రస్తుతం పనిచేయడంలేదు. రోగులు ప్రైవేట్ ల్యాబ్స్‌లో రూ.500 నుంచి రూ.1000 వెచ్చి ంచి పరీక్షలు చేయించుకుంటున్నారు.

రోగులతో ఆసుపత్రులు కిటకిట

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కో ప్రైవేట్ ఆసుపత్రికి ఓపీ 100 నుంచి 200కి పైన ఉంటోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పరీక్షల కోసం వచ్చే వారు సుమారు 1,200 మందికి పైగా ఉంటున్నారు. సాధారణ రోజుల్లో 700 నుంచి 800 మంది మాత్రమే ఆస్పత్రికి వచ్చే వారు. ప్రస్తుతం విష జ్వరాలు, డెంగీ వ్యాధితో రోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్సలు పొందాలి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇష్టానుసారంగా డబ్బులు దండుకుంటే చర్యలు చేపడుతాం.

- కోటా చలం, డీఎంహెచ్‌వో


సూర్యాపేటలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఓపీ కోసం బారులు నిల్చున్న రోగులు

ఆసుపత్రులపై నియంత్రణ ఉండాలి



ప్రైవేట్ ఆసుపత్రులపై అధికారుల నియంత్రణ ఉండాలి. జ్వరం వస్తే టెస్టుల పేరుతో రూ.వేలు వసూలు చేస్తున్నారు. చికిత్స పేరిట లక్షరూపాయలు బిల్లులు వేస్తున్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత పెరిగింది. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

-ములకలపల్లి రాంబాబు, హుజూర్‌నగర్

విషజ్వరాల హాట్‌స్పాట్ కేంద్రాలను గుర్తించాలి


లింగగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

హుజూర్‌నగర్, ఆగస్టు 21 : డెంగీ, విషజ్వరాలకు సంబంధించి హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం హుజూర్‌నగర్‌లో పర్యటించడంతో పాటు మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్యాన్ని ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో జ్వరాలతో బాధపడుతున్న రోగులను పరామర్శించి మండల పరిషత్, వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామంలో డెంగీతో బాధపడుతున్న వారితో మాట్లాడారు. లార్వాను గుర్తించిన ఇంటిని పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం కొరవడిందని, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే డెంగీతో ఇద్దరు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శానిటేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో లార్వా గుర్తించిన వీరబాబు ఇంటిని సందర్శించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలనారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పంచాయతీ వరకు కలెక్టర్, ఇతర అధికారులు నడుచుకుంటూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కోటాచలం, డీపీవో యాదగిరి, ఆర్డీవో శ్రీనివాసులు, వైద్యులు నాజియా, కల్యాణి, నిరంజన్ పాల్గొన్నారు. అదేవిధంగా హుజూర్‌నగర్ పట్టణంలోని పీర్లచావిడి ప్రాంతాన్ని పరిశీలించారు. డెంగీ బారిన ఎంత మంది పడ్డారు. వైద్యం ఎక్కడ తీసుకుంటున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏరియాఆసుపత్రిలో జ్వరాలతో బాధపడుతున్న వారిని కలెక్టర్ పరామర్శించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, వనజ, నక్కా రవికుమార్ పాల్గొన్నారు.

మోడల్ కాలనీని వేగవంతంగా పూర్తిచేయాలి

మోడల్‌కాలనీ ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. ఫణిగిరిగట్టు వద్ద నిర్మాణంలోని జీప్లస్ కాలనీని పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణం చేపట్టాలన్నారు. నాణ్యతలో నిర్లక్ష్యం చేస్తే సహించబోమన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఆర్వోఎఫ్‌ఆర్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, విజయసింగ్, కమలాకర్, సురేందర్‌రెడ్డి, జ్యోతి, మంగ, శంకర్ పాల్గొన్నారు.

పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల పరిశీలన

చిలుకూరు : మండలంలోని నారాయణపురం, సీతారాంపురం గ్రామాల్లో పాఠశాలలు, గ్రామపంచాయతీ కార్యాలయాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తనిఖీ చేశారు. సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం నారాయణపురం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో 71 మంది విద్యార్థుల కోసం 23 నల్లాలు ఏర్పాటుచేయగా, నల్లాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటుచేసి ప్రభుత్వ డబ్బు వృధా చేయడం సరికాదని ఏఈఈకి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో సలీం షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు అవినాష్‌రెడ్డి, కవిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది ఏరీ?

- ..అందుకే ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నాం
- ఆ ఆసుపత్రినీ మూసివేస్తే ఎలా?
- డిప్యూటీ డీఎంహెచ్‌వోను నిలదీసిన మేళ్లచెర్వు గ్రామస్థులు

మేళ్లచెర్వు, ఆగస్టు 21: ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరతతో ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నాం.. వాటిని కూడా మీరు సీజ్ చేస్తే ఎలా అంటూ మేళ్లచెర్వులో డిప్యూటీ డీఎంహెచ్‌వోను గ్రామస్థులు నిలదీశారు. స్థానిక ఆర్‌ఎంపీ ఆసుపత్రిని సీజ్ చేసి వెళ్తున్న ఆయన్ను అడ్డగించి ప్రశ్నల వర్షం కురిపించారు. పోలీసులు సర్దిచెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మేళ్లచెర్వు మండలం వెల్లటూరు గ్రామంలో విష జ్వరం సోకి సోమవారం మృతి చెందిన హర్షవర్ధన్ తండ్రి రామకోటయ్య ఫిర్యాదుమేరకు కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు మేళ్లచెర్వుకు డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ బుధవారం వెళ్లారు. శ్రీరామ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌ను తనిఖీ చేసి సీజ్ చేశారు. దీంతో అక్కడే ఉన్న రోగులు, గ్రామస్థులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీ, ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరతతో తాము ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నామని పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో ఉన్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేస్తే ఎలా అని ప్రశ్నించారు. తమకు అందుబాటులో ఉన్న చిన్నపాటి వైద్యసేవలను దూరం చేయడం ఏమిటంటూ ఆ కేంద్రంలోని రోగులతో పాటుగా ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులు డిప్యూటీ డీఎంహెచ్‌వోను నిలదీశారు. ఆయన కారును అరగంటకు పైగా అడ్డగించి ఆందోళనకు దిగారు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో పోలీసుల సహాయంతో స్టేషన్‌కు వెళ్లారు. ఆందోళన జరిగినంత వరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో కారులోనే ఉండిపోయారు.


కారును అడ్డుకుని ప్రశ్నిస్తున్న రోగులు, కారులోనే ఉన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్(రౌండప్‌లో)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా

ఆర్‌ఎంపీ ఆసుపత్రిని సీజ్ చేయటంతో స్థానికంగా ఉన్న రోగులు అందరూ ఒక్కసారిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా అక్కడ సిబ్బంది లేరు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి, నిరసన తెలిపారు. అదే సమయంలో స్థానికంగా ఒక మహిళ కుక్కకాటుతో చేతికి రక్తం కారుతున్న గాయంతోనే ఆసుపత్రికి చేరుకున్నప్పటికి అక్కడ ఎటువంటి సిబ్బంది లేకపోవటంతో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి ఆమె బంధువులు తీసుకెళ్లారు. కొద్దిసేపటి అనంతరం రోగులు ఆందోళన విరమించారు.

రెండు రోజుల్లో వైద్యులను నియమిస్తాం: నిరంజన్

మేళ్లచెర్వు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది కొరత ఉందని, డిప్యూటేషన్‌పై డాక్టర్, స్టాఫ్‌నర్సు అందుబాటులో ఉన్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ తెలిపారు. డీఎంహెచ్‌వోకు వాస్తవ పరిస్థితులు వివరించగా వెంటనే స్టాఫ్‌నర్సును కేటాయించారని, రేపటి నుంచి ఒక డాక్టర్ ఇద్దరు స్టాఫ్‌నర్సులు 24గంటల పాటు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో అదనంగా మరో వైద్యుడిని మరో ఇద్దరు స్టాఫ్‌నర్సులను ఏర్పాటుచేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాగా శ్రీరామా ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌ను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ మెడికల్ దుకాణం నిర్వహిస్తుండటంతో సీజ్ చేశామని ఆయన తెలిపారు.


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలి


చివ్వెంలలోని మురికి కాల్వను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

చివ్వెంల, ఆగస్టు 21: వెంచర్లు, ఇంటి నిర్మాణాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి, మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో చక్రాల సంతోష్‌కుమార్, ఎంపీవో దయాకర్, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, ఆర్ఐలు శ్రావణి, శ్రీనివాసులు, కార్యదర్శి విక్రం పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్ల ఎత్తివేత



సూర్యాపేటరూరల్, ఆగస్టు 21: హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలతో మూసీ నదికి వరద పోటెత్తుతోంది. దీంతో సూర్యాపేట, నల్లగొండ జిల్లాల సరిహద్దుల్లోని మూసీ ప్రాజెక్టుకు బుధవారం 3,755.52 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇప్పటికే గరిష్ఠ స్థాయి నీటిని ల్వకు దగ్గరలో ఉండటం, ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో బుధవారం మధ్యాహ్నం క్రస్ట్‌గేట్లను ఎత్తాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని మూసీ నది పరివాహక ప్రాంతాల ప్రజలను మూసీ ప్రాజెక్టు అధికారులు అప్రమత్తం చేశారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత 2,7,8 నెంబర్ల క్రస్ట్‌గేట్లను అడుగు మేర ఎత్తి 1,935.29క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టులో వానాకాలం సాగు అవసరాలకు కుడి కాల్వకు 168.89 క్యూసెక్కులు, ఎడమకాల్వకు 216.89 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 2,321.07క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లోగా వెళ్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 645అడుగులు (4.46టీఎంసీలు) కాగా, బుధవారం సాయంత్రానికి 643.60అడుగులు (4.07టీఎంసీ) ఉంది.

త్రిపుర ప్రజలకు మంచి పాలన అందిస్తున్నా

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి


నల్లు ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ఇతరులు

తుంగతుర్తి, ఆగస్టు 21 : కేంద్ర ప్రభుత్వ రాష్ట్రాలకు సమన్వయ కర్తగా ఉంటూ త్రిపుర ప్రజలకు మంచిపాలన అందిస్తున్నామని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గవర్నర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా తుంగతుర్తి మండలానికి విచ్చేయడంతో బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక సిరి ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి ప్రాంత బిడ్డగా త్రిపుర ప్రజలకు గవర్నర్‌గా సేవ చేసే భాగ్యం ప్రధాని నరేంద్రమోదీ కల్పించారని, అందుకు మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఆ ప్రాంతం అంతా బంగ్లాదేష్ సరిహద్దు ప్రాంతమని ఆ రాష్ట్రంలో ఎనిమిది జిల్లాలు ఉన్నాయన్నారు. అందులో గిరిజనులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. అక్కడి జిల్లా అధికారులతో సమావేశమై ప్రజా సమస్యలను, వాటిని పరిష్కరించాల్సిన మార్గాలను తెలుసుకుని ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేస్తూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించేలా కృషి చేస్తున్నానన్నారు. త్రిపుర రాష్ట్ర ప్రజలకు సరిహద్దులో బంగ్లాదేశ్ ప్రజలు ఉంటారని, రెండు ప్రాంతాల మధ్య అంగళ్లు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తారన్నారు. దేశ సరిహద్దు వెంబడి నిరంతరం నిఘా అప్రమత్తం చేస్తూ రాష్ట్ర ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. మొదటిసారిగా తుంగతుర్తికి వచ్చిన సందర్భంగా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు గౌరవ వందనం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డిని వ్యాపారులు, కుల సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కడియం రామచంద్రయ్య, బొబ్బ భాగ్యారెడ్డి, సత్యనారాయణ, సంకినేని వరుణ్‌రావు, సంకినేని రవీందర్ రావు, మల్లెపాక సాయిబాబా, గాజుల మహేందర్ పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం రైతుల తిప్పలు

- ఉదయం ఆరు గంటలకే తిరుమలగిరి ఏపీజీవీబీ వద్దకు చేరుకున్న రైతులు
- తోపులాటలో ధ్వంసమైన మేనేజర్ క్యాబిన్ అద్దాలు



తిరుమలగిరి ఏపీజీవీబీలో క్యూలైన్‌లో ఉన్న రైతులు, తోపులాటలో ధ్వంసమైన మేనేజర్ క్యాబిన్ అద్దాలు

తిరుమలగిరి, ఆగస్టు 21: రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీలోని ఏపీజీవీబీ వద్దకు బుధవారం ఉదయం ఆరు గంటలకే రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బ్యాంకు తెరవడంతోనే సుమారు 200 మంది రైతులు బ్యాంకులో వెళ్లారు. దీంతో సిబ్బంది వారిని క్యూలైన్‌లో ఉంచారు. రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు ఉదయం 11గంటల ప్రాంతంలో ఒక్క సారిగా లోపలికి వెళ్లి కౌంటర్ వద్ద గుమిగూడారు. దీంతో ఖాతాదారులు, రైతులు ఎక్కువగా ఉండడంతో స్వల్ప తోపులాట జరగడంతో మేనేజర్ రూం గదికి ఉన్న అద్దాలు పగిలి ముక్కలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు బ్యాంకు వద్దకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. రైతులందరూ ఒక్కసారిగా బ్యాంకు రావడంతో పరిస్థితి గందరగోళంగా మారుతోందని, టోకెన్లు, లేదా గ్రామాల వారీగా రైతుల రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు అనుమతి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

చాకలిగట్టుకు దారేదీ?

• సాగర్‌లో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు

నాగార్జునసాగర్, ఆగస్టు 21: నాగార్జునసాగర్ ఒక గొప్ప పర్యాటక ప్రాంతమే కాకుండా అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా కూడా విరాజిల్లుతుంది. దీంతో సాగర్‌కు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, బౌద్ధ మతస్థులు వస్తుంటారు. అంతేకాకుండా దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం ఉండటంతో ఎకో టూరిజం పరంగా కూడా అభివృద్ధికి సాగర్‌లో అవకాశం ఉంది. పర్యాటకంగా అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్న నాగార్జునసాగర్ పర్యాటకంపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి.

చాకలి గట్టుకు దారేది?

జలాశయం మధ్యలో 400 ఎకరాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో జింకల సంరక్షణ కేంద్రమైన చాకలిగట్టు నాగార్జునకొండకు కేవలం కిలో మీటరు దూరంలో ఉంటుంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ రోజు లాంచీలు నడుపుతారు. ఈ లాంచీలను చాకలి గట్టు మీదుగా నడిపితే ఎకో టూరిజం పరంగా సాగర్ మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలా చేస్తే సాగర్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుంది. ఏడాది క్రితం చాకలి గట్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు పరిశీలించారు. కానీ నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదు. పర్యాటకశాఖకు ఇంతటి ఆదాయ వనరులు ఉన్న చాకలి గట్టును నిర్లక్ష్యం చేయడం ఏమిటని పలువురు ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ వరకు లాంచీలు నడిపే అవకాశం

సాగర్ ప్రాజెక్టుకు దిగువన 21 కిలో మీటర్ల దూరంలో టెయిల్ పాండ్ ప్రాజెక్టును నిర్మించారు. 21 కిలో మీటర్ల దూరం వరకు సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా, క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు వదిలిన నీరు నిల్వ ఉంటుంది. ఈ నీటిలో లాంచీలను నడిపితే పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణించే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం ఈ ప్రతిపాదనలు కూడా పర్యాటకల శాఖ అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. కానీ నేటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. సాగర్‌కు గురువారం రానున్న పర్యాటక శాఖ అధికారులు సాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు మెరుగు పరిచేలా అలాగే చాకలి గట్టుపైకి పర్యాటకులకు అనుమతి ఇచ్చేలా చూడాలని పర్యాటకులు కోరుతున్నారు.

నేడు చాకలి గట్టుకు పర్యాటక శాఖ అధికారులు

అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న చాకలి గట్టును గురువారం ఉదయం పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, డైరెక్టర్ ఇలా త్రిపాఠీ, ఎండీ ఎస్.ప్రకాష్‌రెడ్డి పరిశీలించనున్నారు. వీరు చాకలి గట్టులో ఎకో టూరిజం అభివృద్ధి గురించి సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మితమైన బుద్ధవనం ప్రాజెక్టు సందర్శించి అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సౌకర్యాలను గురించి పరిశీలించనున్నారు.

నృసింహుడికి నిత్యపూజలు



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారలను మేల్కొపిన అర్చకులు గర్భగుడిలో కొలువదీరిన స్వయంభులను స్వర్ణ ప్రతిష్ఠమూర్తులను అభిషేకరించి తులసీ దళాలతో అర్చించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు పూర్తి చేశారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వర స్వామికి శైవాగమ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,87,635 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

స్వామి వారిని దర్శించిన ప్రముఖులు

స్వామి వారిని షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్‌బాద్ ఎంపీ బలరాంనాయక్ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

FARNAZ

పిడుగుపాటుతో గేదె మృతి

మర్రిగూడ, ఆగస్టు 21: పడిగుపాటుతో గేదె మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని కుదాభక్షపల్లి గ్రామంలో మంగళ వారం రాత్రి జరిగింది. బాధితుడు సిరగోని శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గేదె పిడుగు పడటంతో గేదె మృతి చెందిందని అని తెలిపారు. గేదె విలువ రూ. లక్ష ఉంటుందని తెలిపారు. పాలిచ్చే గేదె మృతిచెందడంతో తాను ఆర్థికంగా నష్ట పోయానని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొమ్మలు తొలగిస్తుండగా..

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 21: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం రాంపురం గ్రామంలో బుదవారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదవూర మండలం ఊట్లపల్లికి చెందిన ఊరడి మల్లయ్య(35) కూలీ పని చేసూత జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రాంపురం గ్రామంలో ముత్యాల మల్లయ్య అనే రైతు బత్తాయి తోటలో మొక్కలు తీయడానికి పదిమంది కూలీలతో పాటు మల్లయ్య కూడా వెళ్లాడు. మొక్కలు కోసే చేసే క్రమంలో బోర్ మోటర్‌కు ఆ బత్తాయి చెట్ల గుండా విద్యుత్ వైర్ వెళ్లింది. అది గమనించని మల్లయ్య తన వద్ద ఉన్న ఇనుప కట్టర్‌తో చెట్టను కొమ్మలు కట్ చేసే క్రమంలో విద్యుత్ వైర్‌ను కట్ చేశాడు. దీంతో కట్టర్ ద్వారా విద్యుదాఘాతంతో పడిపోయాడు. దీంతో తోటి కూలీలు వెంటనే 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అతనిని పరిశీలించగా చని పోయినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. మల్లయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ప్రస్తుతం భార్య గర్బవతి. భార్య ఊరడి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

ఇద్దరు డీలర్ల లైసెన్స్ రద్దు

గుర్రంపోడు, ఆగస్టు 21: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరు డీలర్ల లైసెన్స్‌లను జిల్లా వ్యవసాయ అధికారి శ్రవన్‌కుమార్ రద్దు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి తెలిపారు. బుధవారం కొప్పోలు గ్రామంలో కలెక్టర్ నారాయణరెడ్డి పర్యటనలో రైతులకు అధిక ధరకు యూరియా అమ్ముతున్నారని కలెక్టర్ దృష్టికి తేవడంతో స్పందించిన కలెక్టర్ విచారణ నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి నిర్వహించిన విచారణలో ట్రాన్స్‌పోర్టు చార్జీలు అధికమవుతుండడంతో సుమారు రూ.40 నుంచి రూ.50 వరకు అధిక ధరలకు అమ్ముతున్న జ్యోతిఫర్టిలైజర్స్, శివశంకర్ ఫర్టిలైజర్స్‌ల లైసెన్స్‌లు జిల్లా వ్యవసాయ అధికారి రద్దు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

ఆస్పత్రి ఆవరణలో వ్యక్తి మృతి



ఖుర్షీద్ మృతదేహం

సూర్యాపేటక్రైం, ఆగస్టు 21: అనారోగ్యంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సూర్యాపేటలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఖుర్షీద్(50) కొంత కాలంగా సూర్యాపేటలోని జేజేనగర్‌లో గల బంధువుల నివాసంలో ఉంటూ చర్చి కాంపౌండ్‌లో గల చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఏడాదిగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించింది. దీంతో చికెన్ సెంటర్‌కు వెళ్లడం మానేసి మద్యం సేవిస్తూ ఇంట్లో వెళ్లిన తర్వాత రెండు, మూడు రోజులకోమారు తిరిగి ఇంటికి వస్తున్నాడు. అందులో భాగంగానే ఈ నెల 19న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి బుధవారం వరకు ఇంటికి వెళ్లలేదు. బంధువులు పట్టణంలో వెతికినప్పటికి ఆచూకీ లభించలేదు. మృతుడు మంగళవారం రాత్రి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకుని ఆస్ప త్రి ప్రాంగణంలో నిద్రించాడు. నిద్రలోనే అనారోగ్యంతో మృతిచెందాడు. ఉదయాన్నే గమనించిన ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి కుమారుడు బాసిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

హుజూర్‌నగర్, ఆగస్టు 21: వ్యబిచార గృహంపై దాడి చేసి ఇద్దరు విటులు, గృహ నిర్వాహకురాలను పట్టుకున్నారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం... హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీపీ కాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సాయంత్రం ఐదు గంటల సమయంలో సమాచారం రావడంతో తన సిబ్బందితో వ్యబిచార గృహంపై దాడి చేసి అక్కడ ఇద్దరు విటులు, నిర్వాహకురాలను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారివద్ద నుంచి రూ.1700, ఐదు సెల్‌ఫోన్‌లు, మూడు బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఏషియన్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



శశాంక్ వనమాల

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 21: నల్లగొండ మిర్యాలగూడ పట్టణానికి క్రీడాకారుడు శశాంక్ వనమాల ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రాణిస్తున్నాడు. చైనాలో జరుగుతున్న టోర్నమెంట్‌లో అండర్-15 విభాగంలో తొలి రౌండ్‌లో హాంకాంగ్ క్రీడాకారుడు ఛాన్‌ఇక్‌హ్యాపై విజయం సాధించిన శశాంక్ మంగళవారం జరిగిన మలి రౌండ్‌లోనూ సత్తా చాటాడు. మలేషియా ఆటగాడు ఖైరుల్ అజ్లాన్‌ను ఓడించి ప్రీ క్వార్టర్స్‌కు చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో చైనా క్రీడాకారునితో తలపడనున్నాడు.

ఇన్నోవేషన్ అవార్డు అందుకున్న సుమన్



అవార్డు అందుకుంటున్న సుమన్ భొక్రే

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 21: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సుమన్ బొక్రే ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాన్‌హలాల్ ఆహారం అందించేందుకు స్థాపించిన ఆర్బిట్ కిచెన్(ఓకే)కు ఇన్నోవేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో ఐక్యరాజ్య సమితి అవార్డు ప్రకటించిందన్నారు. సస్టెనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌జీడీ) పేరుతో ప్రకటించిన ఈ అవార్డును హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో అందుకున్నట్లు తెలిపారు. నాన్‌హలాల్ ఆహారం అవసరమైన వారి ఆకలిని తీర్చడంతో పాటు ఆర్బిట్ కిచెన్లలో ఈక్వెల్ ఆపర్చునిటీ కింద డిసబుల్డ్ పర్సన్ల సేవలను ప్రోత్సహించిస్తున్నందుకు రెండు విభాగాల్లో అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఓకేలోని భాగస్వామ్యులందరి కృషితోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు.

రెండున్నర టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాలరూరల్, ఆగస్టు 21 : అక్రమంగా తరలిస్తున్న రెండున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని బుధవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి శివారులో స్పెషల్ బ్రాంచి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ధర్మా తెలిపిన వివరాల ప్రకారం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో స్పెషల్‌బ్రాంచి పోలీసులు చిన్నకాపర్తి శివారులో తనిఖీలు చేశారన్నారు. తనిఖీల్లో గ్రామశివారులో ఆటోను తనిఖీ చేయగా అందులో ఉన్నది రేషన్ బియ్యంగా గుర్తించారన్నారు. 50 బస్తాల్లో రెండున్నర టన్నుల బియ్యాన్ని తరలిస్తుండగా ఎస్‌ఐ తెలిపారు. ఆటోను, బియ్యాన్ని చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలు గ్రామాల్లో బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నారని వీటిని యదాద్రి-భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కల్వకుంటతండాకు చెందిన లావుడి సు రేష్ సేకరించి అక్కడికి తరలిస్తున్నాడని, పట్టుబడిన బియ్యంను ఆటోను చిట్యా ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

నార్కట్‌పల్లి, ఆగస్టు 21:జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే జిల్లాలో కొనసాగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రజల సగటు ఆరోగ్య స్థితిగతులు, జీవన ప్రమాణాలను సర్వే ద్వారా అంచనా వేసి భవిషత్ కార్యాచరణకు మార్గదర్శకంగా ఉండే ఆరోగ్య ప్రణాళిక తయారీ కోసం కేంద్రం ప్రభుత్వం ప్రతీ ఐదేళ్ల కోసారి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే సిగ్మా రీసెర్చ్ అనే సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలోని ఇప్పటికే గుర్తించిన 42గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ప్రతీ బ్యాచ్‌కు ఏడుగురు చొప్పున, ఏడు బ్యాచ్‌లుగా సర్వే నిర్వహిస్తున్నారు.

ఎండుగడ్డి పిరం

- ఇతర జిల్లాల నుంచి పశుగ్రాసం తెచ్చుకుంటున్న రైతులు
- గత ఏడాదితో పోల్చితే భారీగా పెరిగిన ధరలు
- ట్రాక్టర్ గడ్డి రూ.2500లకు కొనుగోలు చేస్తున్న రైతులు



ట్రాక్టర్‌లో వరి గడ్డి తీసుకొస్తున్న రైతు

చింతపల్లి, ఆగస్టు 21: పశుగ్రాసం కొరతతో మూగజీవాలు వేదన చెందుతున్నాయి. జీవాలను కాపాడుకునేందుకు రైతులు ఇతర జిల్లాల నుంచి రైతులు ఇతర జిల్లాల నుంచి పశుగ్రాసాన్ని అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి తెచ్చుకుంటున్నారు. పాలు ఇవ్వడానికి, వ్యవసాయం చేయడానికి పశువులకు మేలు పశుగ్రాసం అందించాలి. కానీ రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలు సాగు చేస్తుండడంతో పశుగ్రాసం దొరకడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పశుగ్రాసం ధరలు భారీగా పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. చింతపల్లి మండలంలో ఈ సంవత్సరం పశుగ్రాసానికి తీవ్రమైన కొరత ఏర్పడింది. గడ్డి దొరక్కపోవడంతో మూగ జీవాలు అల్లాడిపోతున్నాయి. దీంతో బక్కచిక్కిపోతున్న ఆవులు, గేదెలను చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. ఏటా పశువులు మేతకు సరిపడా ఉంచుకొని మిగిలిన దానిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ప్రతి నెలా వరి గడ్డి, జొన్నగడ్డి సాగు చేసి గ్రాసానికి కొదవ లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకునేవారు. గత ఏడాది సరిగా వర్షాలు సరిగా లేకపోవడంతో వరి సాగు తగ్గింది. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఆకలికి అలమటిస్తున్న జీవాలను చూడలేక కొందరు రైతులు కొండబాట పడుతుంటే, మరికొందరు అధిక ధర వెచ్చించి గడ్డి కొనుగోలు చేస్తున్నారు. మరికొద్దరు పాడి పోషణను వదిలేస్తున్నారు.

చింతపల్లి మండలంలో..

చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కువ శాతం వ్యవసాయంపైనే ఆధారపడి నివసిస్తున్నారు. అనుబంధంగా పశుపోషణ చేస్తున్నారు. మండలంలో ఆవులు 9,558, గేదెలు 6,548, గొర్రెలు 38,227, మేకలు 9,885 ఉన్నాయి. గతేడాది వరకు ట్రాక్టర్ వరిగడ్డి రూ.600నుంచి 800లు పలకగా, ఈ సంవత్సరం రూ.2000 నుంచి 2500 వరకు చేరింది. మండలంలో పశుగ్రాసరం దొరకకపోవడంతో రైతులు ఇతర జిల్లాల బాట పడుతున్నారు. చింతపల్లి, వింజమూర్, ఘడియాగౌరారం, నసర్లపల్లి, గొడుకొండ్ల, పోలేపల్లి రాంనగర్, తక్కళ్లపల్లి, కుర్మేడ్, ఉమ్మాపురం, గొల్లపల్లి, చాకిలిశేరుపల్లి, అంగడి కుర్మపల్లి, గ్రామాలకు చెందిన రైతులు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహింపట్నం, మహబూబ్‌నగర్ జిల్లాలోని అమన్‌గల్, కడ్తాల్, కందూకుర్, తాడిపత్రి నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

గడ్డి కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పాడి పోషణపైనే కుటుంబాన్ని నెట్టుకొట్టుస్తున్నాం. కొరత ఉన్నా లాభాలు వస్తాయ నే అనే ఆశతో పాడి పరిశ్రమను కొనసాగిస్తున్నా. ప్రభు త్వం రాయితీపై గడ్డి విత్తనాలు సరపరా చేసి అదుకోవాలి.

● బాదేపల్లి కృష్ణయ్య, రైతు గొడుకొండ్ల.

భారమైనా తప్పడం లేదు

నాకు మూడు గేదెలు ఉన్నాయి. గతంలో సొంత పొలంలో సాగు చేసుకొని వాటికి అవసరమైన గడ్డి సమకూర్చుకున్న. ఈ సారి బోరులో నీరు లేక సాగు చేయలేదు. గేదెలు పోషించేందుకు పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నాం. భారమైనా తప్పడం లేదు.

● కడారి సత్తయ్య, రైతు గొడుకొండ్ల.

ఆంజనేయస్వామి శోభాయాత్రలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో పలువురికి గాయాలు
- నల్లగొండ జిల్లా చందంపేట మండలం పాగిళ్లలో ఘటన



పాగిళ్ల గ్రామంలో ప్రమాదానికి కారణమైన ప్రభ

చందంపేట, ఆగస్టు 21: ఊరంతా వేడుక చేస్తుండగా చివరి ఘట్టంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రభబండికి వైద్యుత్‌వైర్ తాకి విద్యుదాఘాతానికి గురై ఎనిమిది మందికి గాయాలయ్యాయి. దీంతో కార్యక్రమాన్ని నిలిపివేశారు. బుధవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. శ్రావణ మాసం పురస్కరించుకుని మధ్యాహ్నం ఒంటిగంటకు గ్రామస్థులు ఆంజనేయస్వామి శోభాయాత్రను నిర్వహించారు. సుమారు 250మంది గ్రామస్థులు పాల్గొన్న ఈ శోభాయాత్రలో ప్రభ బండ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో ప్రభ బండి వెళ్తుండగా గ్రామంలో విద్యుత్ వైర్ తాకడంతో విద్యుదాఘాతం జరిగింది. ఆ ప్రభబండిపై కూర్చొని ప్రభను పట్టుకున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వారందరినీ ప్రైవేట్ వాహనంలో దేవరకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆరుగురికి స్వల్ప గాయాలు కాగా ఇద్దరికి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్ర గాయాలైన జటావత్ కేలి, జటావత్ లక్ష్మిలను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యుదాఘాతం ఘటనతో ఆ కార్యక్రమాన్ని ముగించిన గ్రామస్థులు ఇళ్లకు చేరుకున్నారు.

కొలనుపాకలో శాతవాహనకాలం నాటి గ్రామం



కొలనుపాకలో లభించిన శతవాహన కాలంనాటి వస్తువులు

ఆలేరు రూరల్, ఆగస్టు 21: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకవాగు ఒడ్డున శాతవాహన కాలం నాటి ప్రాచీన చారిత్రాత్మక గ్రామాన్ని గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా ఆయన కొలనుపాకలో చారిత్మక ఆధారాల కోసం పరనిశోధిస్తున్నారు. ఈ సందర్భంగా ఈత్తిల వాగు ఒడ్డున పాటిగడ్డపై క్షేత్రసాయి పరిశోధన చేయగా ఈ విషయం బయట పడిందని తెలిపారు. ప్రాచీన కాలం నాటి గ్రామం వదిలి వెళ్లిన చారిత్మక ఆధారాలు లభించే చోటును తాటిగడ్డ అంటారని తెలిపారు. ఇక్కడ ఒకటో శతాబ్దం ముందు ఆ తర్వాత కాలంలో మానవ నాగరికత విల్లసిల్లింది అనడానికి అనేక చారిత్మక ఆధారాలు లభిస్తున్నాయని తెలిపారు. ఇక్కడ బౌద్ధ మత నిర్మాణాలకు ఉపయోగించే పాలరాయి ముక్క, మట్టిపూస, రాగిపూస, వివిధ రంగుల్లో ఉన్న గాజు ముక్కలు గవ్వలు గుండ్రాటి రాయి డిజెన్ చేసిన కుండ పెంకులు, రాతి పనిముట్లు లభించాయని వివరించారు. ఈ చారిత్రక్మ ఆధారాన్ని బట్టి ఇక్కడ శాతావాహన కాలంలో- 1 నుంచి మూడు శతాద్బంలో ఒక గ్రామం ఏర్పడిందని, భౌద్ధం విలసిల్లిందన్నారు. ఆలేరు బిక్కేరు వాగు వద్ద ఉందని బౌద్ధ బిక్షకులు ఇక్కడ ఉండటం వల్ల ఈ వాగుకు బిక్కేరు వాగు పేరు వచ్చిందని తెలిపారు. బిక్కేరు వాగు సమీపంలోనే కొలనుపాక గ్రామం ఉందన్నారు. వాగు నుంచి జైన ఆలయం వరకు పురవస్తూ శాఖ పరిశోధిస్తే, భూగర్బంలో దాగి ఉన్న మరింత చరిత్ర బయట పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వేములపల్లి, ఆగస్టు 21: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన జలగం రాములు(53) ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కొంతకాలంగా సూర్యాపేట పట్టణం అలకాపూరి కాలనీలో నివాసముంటున్నాడు. బుధవారం విధి నిర్వహణలో భాగంగా మిర్యాలగూడకు ద్విచక్ర వాహనంపై బయలుదేరి వస్తుండగా శెట్టిపాలెం గ్రామ శివారుకు చేరుకోగానే మిర్యాలగూడ నుంచి సూర్యాపేట వైపు వస్తున్న లారీ అతివేగంగా అజాగ్రత్తతో ఒక్కసారిగా ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాములు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టి కొద్ది దూరం దూసుకొని వెళ్లింది. దీంతో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకోని మృతదేహానికి పంచనామా నిర్వహించి మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం రాములు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

రామన్నపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన తెడ్డు శేఖర్(46) రైతు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శేఖర్ ఈ నెల 19న తన వ్యవసాయ బావి వద్ద పనులు ముగించుకొని టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ఇంటికి వస్తుండగా నిదానపల్లి క్రాస్ రోడ్డు వద్ద భువనగిరి నుంచి చిట్యాల వైపు వెళ్తున్న టీఎస్ 08 జెకె 1998 బుల్లెట్ వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలైన శేఖర్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

నకిరేకల్: శ్రీకాకుళం జిల్లా నుంచి బులెట్ వాహనంపై ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌కు వెళ్తుండగా నకిరేకల్ శివారులో వాహనం అదుపుతప్పి బుధవారం ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్ర గాయాలయ్యాయి. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా సావరకోట మండలంలోని కుమ్మరకుంట గ్రామానికి చెందిన సాదు సంతోష్(24), స్నేహితుడు సారత్ బులెట్‌బైక్‌పై వాళ్ల స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. నకిరేకల్ శివారులోని హరికృష్ణ పార్‌బాయిల్డ్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి డీ వైడర్‌ను ఢీ కొట్టారు. సంతోష్ అక్కడికక్కడే మృతిచెందగా సారత్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్సకోసం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు.

ఆత్మకూరు(ఎం): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. బోడపప్పల్‌కు చెందిన పగిడిపల్లి అబ్బయ్య, అతని భార్య సావిత్ర ద్విచక్రవాహనంపై ఆత్మకూరు (ఎం) మండలం రహీంఖాన్‌పేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా, మండల కేంద్రంలో ద్విచక్రవాహనానికి అకస్మాత్తుగా కుక్క అడ్డం వచ్చి తగలడంతో ఇరువురు పడిపోగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి భువనగిరి ఆసుపత్రికి తరలించారు.

అడ్వాన్స్ చెల్లించాలని వైద్యం చేయలేదు

- కొత్తపేట పారమిత ఆసుపత్రిలో బాలిక మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన
- హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో ఘటన



అధిర(ఫైల్)

నల్లగొండ క్రైం, ఆగస్టు 21: శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న తమ కుమార్తెకు వైద్యం చేయకుండా అడ్వాన్స్ చెల్లించాలంటూ ఆలస్యం చేయడంతో చిన్నారి మృతిచెందిందని బాధితురాలి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం హైదరాబాద్ ఎల్బీనగర్‌లో కొత్తపేట పారమిత ఆసుపత్రిలో ఈ సంఘటన జరిగింది. బాధితులు, నల్లగొండ జిల్లా కేంద్రం పానగల్‌కు చెందిన చింత అజయ్‌బాబు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పానగల్‌కు చెందిన చింత అజయ్‌బాబు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, ఆయన కుమార్తె చింత అధిర(5) కొద్ది రోజులుగా న్యుమోనియాతో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని చిన్నపిల్లలకు సంబంధించిన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఆమెను మంగళవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని కొత్తపేటలో ఉన్న పారమిత ఆసుపత్రికి తీసుకెళ్లారు. అధిరకు వెంటనే వైద్యం చేయకుండా ఓపీ నమోదు చేయించి, అడ్వాన్స్ చెల్లించాలని 40 నిమిషాల వరకు వైద్యం ప్రారంభించలేదని బాలిక కుటుంబసభ్యులు ఆరోపించారు. అప్పటికే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న అధిరకు పారమిత ఆసుపత్రి నిర్వాహకులు సరైన సమయంలో చికిత్స అందించకపోవడంతోనే మూడు గంటల సమయంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. దీంతో ఆగ్రహం చెందిన కుటుంబసభ్యులు పారమిత ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. అధిర మృతికి ఆసుపత్రి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని, ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ఆస్పత్రి వద్ద బందోబస్తు నిర్వహించారు. విషయం తెలుసుకున్న వైద్యశాఖ అధికారులు ఆసుపత్రికి వచ్చారు. చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. పానగల్‌లోని స్మశాన వాటికలో బుధవారం అధిర అంత్యక్రియలు నిర్వహించారు.

అసోం వాసి అదృశ్యం.. కేసు నమోదు



లకన్ బూమ్‌జి(ఫైల్)

భువనగిరి రూరల్, ఆగస్టు 21: అసోం రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అసోం రాష్ట్రం సోనిటీపూర్ జిల్లా బిశ్వనాథ్ చార్లీ మండలం జాబ్ బౌరి గ్రామానికి చెందిన లకన్ బూమ్‌జి(22) ఆరు నెలల క్రితం భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం శివారులోని రాజశ్రీ ఎంటర్ ప్రైజెస్ ఎక్స్‌ప్లోజివ్ గోదాం కంపెనీలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే ఓ గదిలో రూమ్‌లో నివాసముంటున్నాడు. అతనితో పాటు అతని బాబాయ్ బూమ్‌జీ కార్తీక్‌తో ఆరు నెలలుగా ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని బాబాయ్‌కి చెప్పి వెళ్లాడు. బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. అతని సెల్‌ఫోన్ స్విచ్ఆఫ్ ఉంది. చుట్టు పక్కల వెతికినా కన్పించకపోవడంతో బుధవారం అతని బాబాయ్ కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గంజాయి తాగుతూ పోలీసులకు చిక్కి..

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 21: ఏడాది కాలంగా గంజాయి మత్తుకు వ్యసనపరులైన ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పోలీసులకు బుధవారం చిక్కారు. ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం ముక్తాపూర్ గ్రామానికి చెందిన రమావత్ భానుప్రకాష్(19), ముద్దం బాలమల్లేశం(19), గోదాసు రాజు (19) గత ఏడాదిగా గంజాయికి బానిసలయ్యారు. వీరు హైదరాబాద్‌లోని దూల్‌పేట వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తెచ్చుకుని నిత్యం గ్రామంలోని పాతబడిన ఇంట్లో రాత్రి సమయంలో గంజాయి సేవిస్తున్నారు. అయితే సమాచారం అందుకున్న

భూదాన్‌పోచంపల్లి పోలీసులు బుధవారం ముక్తాపూర్ గ్రామంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పోలీసులు 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నిందితులు ముగ్గురు 8వ తరగతి వరకు క్లాస్‌మేట్లు. వీరు స్నేహితులుగా మారడంతోపాటు గంజాయికి బానిసలయ్యారు. వీరు రోజువారీ కూలీలుగా అక్కడక్కడా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య

భువనగిరి టౌన్, సూర్యాపేటక్రైం, డిండి, ఆగస్టు 21: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని పోలీస్‌క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టబుల్ భార్య, భువనగిరి పట్టణానికి చెందిన వంట కార్మికుడు, సూర్యాపేటలో వృద్ధుడు, నల్లగొండ జిల్లా డిండి మండలంలో యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు.

పోలీస్‌క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్ భార్య



విజయలక్ష్మి(ఫైల్)

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన చెందిన మెట్టు మధుసూదన్‌రెడ్డి భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. 18సంవత్సరాల క్రితం వివాహంకాగా, వారికి సంతానం కలగలేదు. దీంతో మొదటి భార్య అంగీకారం, బంధువుల నిర్ణయంతో రామన్నపేట మండలం నీర్నెంల గ్రామానికి చెందిన విజయలక్ష్మి(35)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఏడాది తేడాతో మొదటి భార్యకు కవలలుగా కుమారులు, రెండో భార్యకు కుమార్తె జన్మించారు. అప్పటినుంచి మొదటి భార్య పిల్లలతో 14 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటోంది. మధుసూదన్‌రెడ్డి రెండో భార్య, 15ఏళ్ల కుమార్తెతో కలిసి భువనగిరిరూరల్ పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తలెత్తిన ఆస్తి తదితర కుటుంబ వివాదాలతో కొంతకాలంగా దంపతులు, బంధువుల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. రోజువారిగానే విధులకు వెళ్లిన మధుసూదన్‌రెడ్డి బుధవారం మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వచ్చేసరికి విజయలక్ష్మి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో మధుసూదన్‌రెడ్డి కేకలు వేయడంతో క్వార్టర్స్‌లో ఉన్న పోలీస్ కుటుంబాలతో పాటు పక్కనే ఉన్న పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బంది క్వార్టర్స్‌కు చేరుకొని తలుపులను బద్దలుకొట్టి లోనికి ప్రవేశించి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతున్న విజయలక్ష్మిని కిందికి దించారు. అప్పటికే ఆమె మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో..



వేణుకుమార్‌రెడ్డి(ఫైల్)

భువనగిరి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన వంట కార్మికుడు గంగదేవి వేణుకుమార్‌రెడ్డి(42) అద్దెకు ఉంటున్న ఇంట్లో బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గంగదేవి వేణుకుమార్‌రెడ్డి, స్రవంతి సుమారు 12ఏళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. అతను హోటల్స్‌లో వంట కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంత కాలం క్రితం సొంతంగా టిఫిన్ సెంటర్ నిర్వహించాడు. ఆర్థిక ఇబ్బందులతో భార్య, భర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి తీవ్రస్థాయిలో గలాటా జరగడంతో భార్య స్థానికంగానే ఉండే పుట్టింటికి వెళ్లింది. బుధవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి వేణుకుమార్‌రెడ్డి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణం అంటూ అత్త, భార్య, మరదలి పేరు తాను ఉరివేసుకున్న గది గోడపై రాసాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అంత్యక్రియలకు వెళ్లిన భార్య పిల్లలను అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణ జరిగింది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

మృతదేహం పక్కన పరుగుల మందు బాటిల్



గుర్తుతెలియని వ్యక్తి

సూర్యాపేట పట్టణంలోని -65వ జాతీయ రహదారి వెంట అంజనాపురి కాలనీ సమీపంలో సద్దుల చెరువు కట్ట వద్ద సుమారు 60ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పక్కన పురుగు మందు డబ్బా లభించింది. పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీ భద్రపరిచినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ వివరాలు తెలిసిన వారు సెల్: 8712686005కు సమాచారం ఇవ్వాలని కోరారు.

యాసిడ్ ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

నల్లగొండ జిల్లా డిండి మండలం ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన తెలకపల్లి హరికృష్ణ(26) లారీ నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం తల్లిని వేధిస్తుండేవాడు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రూంలో ఉన్న యాసిడ్ తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు.

వర్గీకరణతో అభివృద్ధి సాధ్యం కాదు

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ తలమల్ల హుస్సేన్, మేకల కోటేశ్వరరావు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణతో అభివృద్ధి సాధ్యం కాదని ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ తలమల్ల హుస్సేన్ అన్నారు. భారత్ బంద్‌లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని సుప్రీంకోర్టు పరిగ ణనలోని తీసుకుండా కేవలం 16ఆర్టికల్‌ను తీసుకుని తీర్పు ఇవ్వడం దళిత, గిరిజనులను విడదీయడమేనని ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో రాష్ట్రాలకు అధికారం ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమనిదేశంలో ఎస్సీ, ఎస్టీ కులాల జనాభా జాబితాను రూపొందించి, ఏ కులం అభివృద్ధి చెందిందో సర్వే చేసి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తగిన నిధులు కేటాయిస్తేనే వెనుకబడిన కులాలు అభివృద్ధి చెందుతాయని, వర్గీకరణతో ఎలాంటి అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ర్యాలీ నిర్వహించడంతో పాటు ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేసి, దుకాణాలను బంద్ చేయించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఏడిండ్ల అశోక్, రవి, దాసరి దేవయ్య, కట్ల మురళి, కట్ట సైదులు, బొల్లెద్దు వినయ్, అఖిల్, జానకిరాములు, సంజయ్, అనిల్, గాజుల నర్సయ్య, గోపయ్య, వేణు, బలరాం పాల్గొన్నారు.

కోదాడ రూరల్: సుప్రీంకోర్టు తీర్పుని వెనక్కితీసుకోవాలని పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సూదుల రాములు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకి వ్యతిరేకంగా మండలంలోని తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు రాంపురం క్రాస్‌రోడ్డు వద్ద పీవీ రావు మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనట్లయితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి మాలలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు గోపి, మండల అధ్యక్షుడు ఎర్రమల నాగార్జున్, గ్రామ శాఖ అధ్యక్షుడు అప్పారావు, బోయల గోపి, శ్రీను, చిట్టిబాబు, ఉపేందర్, చింటూ, సురేష్, శేఖర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్, తిరుమలగిరి: ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని మాల మహానాడు మండల నాయకుడు బాషమల్ల భాస్కర్ అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మండలంలోని తొండ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతులు బహిష్కరించి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు దళిత జాతులను కించపరిచేలా ఉందన్నారు. ప్రభుత్వం ఈ వెంటనే ఈ తీర్పును నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, లచ్చయ్య, అనంతి, శ్రీను, అనిల్, జానీ, సోమన్న, ఉమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో నిరసనలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు



సూర్యాపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

● ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన భారత్‌బంద్ తిరుమలగిరిలో ప్రశాంతంగా ముగిసింది. తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో పలువురు నల్ల రిబ్బన్లు ధరించి, నినాదాలు చేస్తూ, బైక్‌ర్యాలీ చేస్తూ బంద్‌కు సహకరించాలంటూ వ్యాపార సముదాయాలు, పాఠశాలలను మూయించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గంట లక్ష్మణ్, గంట సందీప్, సంపత్, ఉదయ్, మాణిక్యరావు, మద్దెల ప్రభుదాస్, నరేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల గొంతుక గద్దర్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 21: ప్రజా సమస్యల గొంతుక ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 28న నిర్వహించే గద్దర్ ప్రథమ వర్ధంతి సభ పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. విప్లవ ఉద్యమంలో ఆట..పాటతో గద్దర్ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాడని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ గాయకుడు ఏపూరి సోమన్న, చింతమల్ల రమేష్, మధు, నమిలు ఉపేందర్, పొరెళ్ల విప్లవకుమార్, సురేష్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించాలి

కోదాడ టౌన్, ఆగస్టు 21: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అధర్యంలో కోదాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నిర్వహించే క్రీడా పోటీలను ఈ నెల 31వ తేదీ లోపు నిర్వహించాలని డివిజన్ విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. బుధవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిని విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీలన సెప్టెంబరు 15వ తేదీ లోపు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు, జిల్లా కార్య దర్శి ఆజ్జంబాబా, సీతారాంరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి, పి.ప్రకాష్, కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి జి.కొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

అర్వపల్లి, ఆగస్టు 21: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని ఎంఈవో బాలునాయక్ అన్నారు. మండల స్థాయి పాఠశాలల విద్యార్థులు ఆటల పోటీల కోసం బుధవారం జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి ఎమ్మార్సీలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో ఆటల పోటీలను జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెప్టెంబరు మూడో తేదీన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పీడీలు మల్లేష్, సైదులు, లలిత, వైవీరావు, పాల్గొన్నారు.

'సంక్షేమ వసతి గృహాల్లో సీట్లను పెంచాలి'

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 21: సంక్షేమ వసతి గృహాల్లో సీట్లను ప్రభుత్వం పెంచాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది పేద విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో ఉండి చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మరాజు వెంకట్, కత్తి సైదులు, నిఖిల్ చక్రవర్తి, జయంత్, శివ, నరేందర్, సంతోష్, అశోక్, అభిరానందన్‌పాల్గొన్నారు.

అక్షరాస్యత ఉద్యమకారుడు అంజన్న

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 21: అక్షరాస్యత ఉద్యమకారుడు కారుపోతుల అంజన్న అని అభ్యుదయ యువజన సమాఖ్య యూత్ అధ్యక్షుడు రేగుల మహేందర్, దయాయాదవ్, కిషన్ అన్నారు. అంజన్న 29వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన స్వగ్రామంలో మండలంలోని తాటిపాములలో అభ్యుదయ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని అంజయ్య స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. సాక్షరత ఉద్యమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 5000మంది కళాకారులను తయారు చేసి పేదలకు చదువుపై అంజన్న అవగాహన కల్పించారని కొనియాయడారు. అంజన్నను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు రమేష్, సురేష్, వార్డు మాజీ సభ్యుడు అవిలయ్య, శ్రీను, మల్లేష్, కాంతయ్య, చంద్రనారాయణ, రాజు, అంజి, ప్రవీణ్, సంతోష్‌కుమార్, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సక్కుబాయమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

చిలుకూరు, ఆగస్టు 21: సీపీఐ నాయకురాలు, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావు సతీమణి సక్కుబాయమ్మ ఆశయ సాధనకు సీపీఐ కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో సక్కుబాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, గీతపనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, సాహెబ్ అలీ, కనకయ్య, అంజనేయులు, రాము, మధు, కొండలు, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సూర్యాపేట అర్బన్, కోదాడ ఆగస్టు 21: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని లెనిన్‌నగర్‌లో డాక్టర్‌కు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఒక మహిళ సీఎం ఉన్న పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయన్నారు. అదేవిధంగా మహారాష్ట్రలో మూడేళ్ల బాలికపై లైంగిక దాడి జరడడం సభ్య సమాజానికి సిగ్గుచేటని అన్నారు. మద్యం, మత్తు పదార్థాలను ప్రభుత్వాలు నియంత్రించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలు చైతన్యంతమై తమను తాము కాపాడుకునే విధంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర అఖిల్‌కుమార్, శారద, సంతోషి, అంజలి, కల్పన గౌరమ్మ, రాధ, శ్రీదేవి, జయమ్మ, పద్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.



సూర్యాపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు



కోదాడలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

● వైద్యురాలిని హత్యాచారం చేయడం అత్యంత బాధాకరమని ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కారింగుల అంజన్‌గౌడ్ అన్నారు. ఈ ఘటనకు నిరసనగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం సాయంత్రం కోదాడలోని బస్‌స్టేషన్ ఆవరణలోని గాంధీ విగ్రహం నుంచి కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం మహిళా డాక్టర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి.రఘు, హరికిషన్, శ్రీనివాసరావు, రాంబాబు, ఎం.లక్ష్మణ్, పూర్ణచంద్రరావు, శ్రీకాంత్, నజీర్, నాగరాజు, వెంకట్, నారాయణ, సురేష్, లక్ష్మణ్, సైదులు, రామారావు, గోపాల్, లింగయ్య, నరేష్, గోపి, నాగరాజు, శ్రీహరి, రామకృష్ణ, సత్యనారాయణ, సునీల్, కిట్టు, మజ్హుకర్ మజహర్, నియోజకవర్గ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై బిల్లు ప్రవేశపెట్టాలి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పడిదల రవికుమార్‌మాదిగ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై మాదిగలు ఆయన రుణపడి ఉన్నారని తెలిపారు. వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉప కులాల అభివృద్ధి చెందుతాయన్నారు. వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిపాపయ్య ఆధ్వర్యంలో 30ఏళ్ల పాటు నిరంతరం పోరాటం చేశామని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో మరికంటి అంబేడ్కర్ కనుకుజానయ్య నాగరాజు, వినోద్, ఉపేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పడిదల రవికుమార్

విద్యార్థినులకు మానసిక ధైర్యం ఉండాలి



మునగాల కేజీబీవీలో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

మఠంపల్లి ఆగస్టు 21: విద్యార్థినులకు మానసిక ధైర్యం కలిగి ఉండాలని హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు అన్నారు. షీటీంపై బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాల, పాఠశాల (మోడల్ స్కూల్)లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యలను విద్యార్థినులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆనంద్‌నాయక్, ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు జాకీర్, సైదయ్యగౌడ్, లక్ష్మణ్, నాగరాజు, భారతి, వాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

నేరేడుచర్ల, మునగాల రూరల్: విద్యార్థులు సన్మార్గంలో నడవాలని నేరేడుచర్ల, మునగాల ఎస్ఐలు రవీందర్, ప్రవీణ్‌కుమార్ అన్నారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థుకు ఎస్ఐ రవీందర్ అవగాహన కల్పించారు. మునగాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. దురలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండి లక్ష్యంతో చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. డ్రగ్స్ వినియోగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైదులు, లెక్చరర్లు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఐ సైదుల అన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యలో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం

తుంగతుర్తి, ఆగస్టు 21: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని రికార్డులను, మందులను పరిశీలించి మాట్లాడారు. సెప్టెంబరు మొదటి వారం నుంచి డిసెంబరు చివరి వరకు పశువుల గణన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.. పశువుల పచ్చి మేత కోసం సబ్సిడీపై జొన్నలు అందజేస్తామన్నారు. అనంతరం తిరుమలగిరి, పనిగిరి, అర్వపల్లి, నూతనకల్ మండలాల్లోని పశువైద్యశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ రవిప్రసాద్, మహేష్, శ్రీనివాస్, నరేష్, బాలు పాల్గొన్నారు.

పాలకవీడు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్యాధికారులు అవగాహన కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అనంత ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తండాల్లో మలేరియా, డెంగీ జ్వరాల బారిన గత ఏడాది చాలా మంది ప్రజలు పడ్డారన్నారు గామాల్లో, తండాల్లో రహదారి వెంట పెంట కుప్పల దోమలకు ఆవాసాలుగా మారాయన్నారు. దోమల కాటుతో ప్రజల రోగాల బారిన పడుతున్నార న్నారు. ఆరోగ్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని రోగాల బారిన పడకుండా మండల ప్రజలను కాపాడాలని కోరారు.



ఆత్మకూర్(ఎస్): మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు అలయ ఈవో కుశలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పెన్‌పహాడ్: వ్యక్తిత్వ వికాసానినిక డైరీలు ఎంతగానో దోహదపడుతాయని ఎంఈవో రవి అన్నారు. బుధవారం మండలం లోని జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు డైరీలు పంపిణీ చేసి మాట్లాడారు. డైరీలో రాసిన అంశాలపై ప్రతి 15రోజులకు విద్యార్థులు రివ్యూ చేయాలన్నారు.

● కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానని ఆ పార్టీ మండల నాయకుడు కొడిదల రాంబాబు స్పష్టం చేశారు. పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు తను పార్టీ మారినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

చివ్వెంల: పారిశుద్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని చివ్వెంల మండల ప్రత్యేక అధికారి జగదీష్‌రెడ్డి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన వారాంతపు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తసీహల్ధార్ కృష్ణయ్య, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో దయాకర్, ఏఈ మౌనిక, ఏపీవో నాగయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: సీపీఐ నాయకుడు జక్కుల మల్లయ్య మృతి ఆ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన మల్లయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.

నేరేడుచర్ల: పట్టణంలో బుధవారం నిర్వహించిన పీఆర్టీయూ సర్వసభ్య సమావేశంలో ఆ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా యడవెల్లి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మాతంగి సైదులు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలుగా బడావత్ విజయ, మండల కార్యదర్శిగా ధరావత్ నాగయ్య, మహిళా కార్యదర్శిగా నాగవాణిని ఎన్నుకున్నారు.

● నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్వర్యంలో మండలంలోని వైకుంఠపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం నోటు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామస్వామి, క్లబ్ ప్రధానకార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, బొంత అనిత, ఉపాధ్యాయురాలు శోభ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: కోదాడ మునిసిపాలిటీలో గొర్రెలు, మేకల రిజిస్ట్రేషన్, అఖిల భారత పశుసంపద పోర్టల్ (భారత్ పశుదాన్ పోర్టల్)లో నమోదు కార్యక్రమాన్ని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మానవాళికి ఆరోగ్యకరమైన ఆహారం అందేలా పశువుల ఆరోగ్యాన్ని కాపాడడానికి ఈ పోర్టల్ ఉపయోగపడుతుందన్నారు. ఎవరైనా జీవాల పెంపకందారులు తమ జీవాల రిజిస్ట్రేషన్ చేయించుకో నట్లయితే ప్రాంతీయ పశువైద్యశాలలో సంప్రదిస్తే వారి ఇంటి వద్దనే రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.

మద్దిరాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీ యూ-టీఎస్ కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతిరెడ్డి రామలింగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, ఇరుగు సోమయ్య, ఉప్పు నాగయ్య, వెంకటయ్య, మేడిపల్లి శ్రీనివాస్, కందుకూరి శివశంకర్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి ధర్నాను తిరుమలగిరి చౌరస్తాలో గురువారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ధతెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హజరవుతారని, ధర్నాలో బీఆర్ఎస్ శ్రేణులు, రుణమాఫీ కాని రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

25న క్రికెట్ ఓపెన్ సెలక్షన్స్ ట్రయల్స్

భానుపురి, ఆగస్టు 21: తెలంగాణ క్రికెట్ అసోషియేషన్ ఆదేశాల మేరకు జిల్లా క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో క్రికెట్ జట్ల ఎంపికకు ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్‌ను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా క్రికెట్ కార్యదర్శి కె.శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. సూర్యాపేటలోని ఎస్వీ క్రికెట్ అకాడమిలో ఓపెన్ సెలక్షన్స్ నిర్వహించి అండర్-16, అండర్-19, అండర్-25 జట్లను ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు తమ వివరాలను రిజిస్టేషన్ చేయించుకోవాలని, పూర్తి వివరాలకు జిల్లా కోచ్ వి.సుధాకర్‌నాయక్ సెల్ నెం. 8790803238ను సంప్రదించాలన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

కోదాడ టౌన్, ఆగస్టు 21: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ ఎం.చైతన్య అన్నారు. బుధవారం పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలపై అసభ్యంగా ప్రవర్తిస్తే ఫోక్సో కేసు నమోదవుతుందని, దీంతో భవిష్యత్‌కు ఇబ్బంది మారుతుందని అందరూ గ్రహించాలన్నారు. బాలికలు తల్లిదండ్రులను గౌరవించాలని, సత్ప్రవర్తనతో ఉండి విద్యలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, పాఠశాల హెచ్‌ఎం ఎండీ సలీంషరీఫ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.మార్కండేయ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



పాఠశాలలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న విద్యార్థి

నేరేడుచర్ల, ఆగస్టు 21: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌కు పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. 2004-05బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.30వేల వ్యయంతో వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంటును, మంచినీటి ట్యాంకును పాఠశాలకు బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న ఈ తరుణంలో పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఏర్పాటుచేసిన వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంటు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరబాబు, సైదులు, రషీద్ ఖాన్, జానకిరాములు, వెంకటేశ్వరావు, మాధవి, నాగమణి, జానయ్య, శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులు బాలకృష్ణ, నరేష్, శ్రవణ్, సురేష్, జ్యోతి, మహేశ్వరి, జానకి, సతీష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడానికి ముందుకు రావాలి



ఆర్థికసాయంఅందజేస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేట టౌన్, ఆగస్టు 21: పేదలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పిల్లలమర్రి అవినాష్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదవుతున్నాడు. ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నందున కృపాకర్ బుధవారం సూర్యాపేట లోని ఆయన స్వగృహంలో అవినాష్‌కు రూ.10వేలు ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. హైద్రాబాద్ నాగోల్‌లోని శ్రేయస్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న అవినాష్‌కు సాయం అందించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవినాష్ తల్లిదండ్రులు పిల్లలమర్రి రేణుక, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 21: జాతీయ స్కాలర్‌షిప్‌ల కోసం జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమాధికారి నర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ పథకంలో భాగంగా నేషనల్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారన్నారు. ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం జిల్లాలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఇంటర్ విద్యార్థులు, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ కోసం. డిగ్రీ, పీజీ, డిప్లొమా విద్యార్థులు అక్టోబరు 31వ తేదీ లోపు సంబంధిత పోర్టల్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలన్నారు.

మద్దిరాల ఎస్ఐగా వీరన్న బాధ్యతల స్వీకరణ



మద్దిరాల, ఆగస్టు 21: మద్దిరాల ఎస్ఐగా మెతుకు వీరన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై మద్దిరాలకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరన్న మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు.

తిరుమలగిరి ఏవోగా నాగేశ్వరరావు



తిరుమలగిరి, ఆగస్టు 21: తిరుమలగిరి మండల ఏవోగా సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఏవో వెంకటేశ్వర్లు బదిలీపై చివ్వెంల వెళ్లగా, నల్లగొండ జిల్లా డిండి మండల ఏవోగా పనిచేస్తున్న నాగేశ్వరావు తిరుమలగిరికి బదిలీపై వచ్చారు.

డెయిరీలతో లాభాలు పొందాలి

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 21: మహిళ రైతులు పాల డెయిరీలతో లాభాలు పొందాలని డీఆర్‌డీఏ పీడీ సురేష్ కోరారు. ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో బుధవారం పట్టణంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం స్వరూపారాణి, పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, సీసీ పరిమళ, జ్యోతి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

నేరేడుచర్ల, ఆగస్టు 21: అర్హులందరికీ పంట రుణాలను మాఫీ చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు కోరారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.